ఎంబీఏ వన్‌టైం చాన్స్ పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 12: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ వన్‌టైం చాన్స్ సప్లమెంటరీ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (సీబీసీఎస్, నాన్ సీబీసీఎస్) వన్‌టైం చాన్స్ అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చేనెల 11 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

టెక్ మహీంద్రా స్మార్ట్‌లో ఉచిత కంప్యూటర్ శిక్షణ

బన్సీలాల్‌పేట్, నవంబర్ 12 : అప్సా, టెక్ మహీంద్రా ఫౌండేషన్ స్మార్ట్ కేంద్రంలో ఉచిత నైపుణ్య శిక్షణా కోర్సును ప్రారంభిస్తున్నామని స్మార్ట్ శిక్షణా కేంద్రం మేనేజర్ షేక్ మౌలా అన్నారు. బస్తీల్లో నివసించే పేద, మధ్య తరగతికి చెందిన పదవ తరగతి పాసై, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన 19 నుంచి 27 ఏండ్ల వయస్సు ఉన్న యువతీయువకులకు మూడు నెలల పాటు కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీస్, టైపింగ్, ఇంటర్నెట్, రిటైల్ రంగాల్లో ఉచిత శిక్షణ అందించి, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఫోన్: 91549 90133, 84980 89786లలో సంప్రదించాలని ఆయన కోరారు. గాంధీ దవాఖాన ఎదురుగా యాక్సిస్ బ్యాంక్ సమీపంలో ఎవర్‌గ్రీన్ కమ్యూనిటీ హాల్‌లో తమ శిక్షణా కేంద్రానికి నేరు గా వచ్చి కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

నేడు వాహనాల వేలం

ఉప్పల్/ఘట్‌కేసర్ : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో సీజ్ చేసిన మూడు బైక్‌లను జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ మల్కాజిగిరి ఆధ్వర్యంలో వేలం వేయనున్నట్లు ఉప్పల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఓంకార్ తెలిపారు. బుధవారం 11గంటలకు వేలంలో పాల్గొనవచ్చని,వివరాలకు 8712658738లో సంప్రదించాలన్నారు.

మందకొడిగా సమగ్ర సర్వే

బేగంపేట్, నవంబర్ 12: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వే బేగంపేట్ సర్కిల్ పరిధిలో మందకొడిగా సాగుతోంది. ఈ నెల 18 వరకు సర్వే పూర్తి చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు ఇండ్లను లిస్ట్ అవుట్ చేయడమే పూర్తి అయినట్టు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. అయితే..ఆదివారం వరకు సర్కిల్ పరిధిలో ఇండ్ల లిస్ట్ అయినట్లు అధికారులు తెలిపారు. బేగంపేట్ సర్కిల్ పరిధిలోని బేగంపేట్, రాంగోపాల్‌పేట్, మోండా మార్కెట్, బన్సీలాల్‌పేట్ డివిజన్‌లకు 432 మంది ఎన్యూమరేటర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 18 వరకు మొత్తం సర్వే పూర్తి చేసి 19 నుంచి సేకరించిన డాటాను కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు సర్కిల్ డీసీ సమ్మయ్య తెలిపారు.

బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో కుటుంబ వివరాలు సేకరిస్తున్న ఎన్యూమరేటర్లు

సహకరించని స్థానికులు

బేగంపేట్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సర్వే అధికారులు ఇంటింటికి వివరాలు సేకరించేందుకు వెళ్లగా.. చాలా మంది వివరాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే చాలా సర్వేలు చేసి కుటుంబ వివరాలు సేకరించారు... మళ్లీ ఇప్పుడు ఎందుకు అని చాలామంది వివరాలు తెలుపడంలేదని సమాచారం.

అక్రమాలకు పాల్పడితే డీలర్లపై కఠిన చర్యలు

చిక్కడపల్లి,నవంబర్ 12 : రేషన్ సరుకుల సరఫరాలో రేషన్ డీలర్లు అక్రమాలకు, అవినీతికి ప్పాలడితే చట్ట పరంగా కేసులు నమోదు చేసి లెసెన్స్‌ను రద్దు చేస్తామని సర్కిల్- 6 అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి దీప్తి అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో షాపుల తనిఖీలకు శ్రీకారం చేపట్టామని తెలిపారు.ఈ నెల 8న అంబర్‌పేట్‌లోని రేషన్ షాప్ నంబర్ 680లో ఉండవలసిన వాటికంటే 33 కేజీల గోధుమలు, 45 కేజీల బియ్యం ఎక్కువగా ఉండడంతో ఆడీలర్‌పై కేసు మోనమోదు చేసినట్లు తెలిపారు. సరుకుల్లో ఎలాంటి తేడా వచ్చినా కేసులు పెడతామని హెచ్చరించారు. నిర్ణీత సమయం ప్రకారం షాపులను తెరిచి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఆమె సూచించారు.

దివ్యాంగులను మోసం చేసిన ప్రభుత్వం

డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డెఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్

చిక్కడపల్లి, నవం బర్ 12: కుటుంబ సర్వేలో 21 రకాల వైకల్యాలను గుర్తించకుండా ప్రభుత్వం ది వ్యాంగులను మోసం చేసిందని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డెఫ్(డీఎస్‌డీ) రాష్ట్ర అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్ మండిపడ్డారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని డీఎస్‌డీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుటుంబ సర్వేలో 21 రకాల వికలాంగులను విస్మరిందని మండిపడ్డారు. కుటుంబ యజమాని , కుటుంబ సభ్యుల వ్యక్తిగత వివరాలను సేకరించడానికి పార్ట్-1 ఫారంలో 13వ నంబర్ కలామ్‌లో మీరు దివ్యాంగులా అని అడిగారని తెలిపారు. వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం 21 రకాల వైకల్యాలను గుర్తించిందని తెలిపారు. అన్ని కులాలకు ఇచ్చిన ప్రాధాన్యత దివ్యాంగులకు ఎం దుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ విషయాన్ని మెయి ల్, వాట్సాప్ ద్వారా వికలాంగ సంక్షేమ డైరెక్టర్ దృష్టికి తీసుకెల్లడం జరిగిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో 21 రకాల దివ్యాంగుల వివరాలు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డీఎస్‌డీ రాష్ట్ర కన్వీనర్లు భారతి, కాటమోని వెంకటేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వల్లభనేని

సంపన్న దేశాలు పేదదేశాలపై వివక్ష సరికాదు: డాక్టర్ కొండా నాగేశ్వరరావు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 12: సంపన్న దేశాలు పేద దేశాలపై వివక్ష చూపడం సరికాదని ఉస్మానియా యూనివర్సిటీ సివిల్ సర్వీసెస్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ కొండా నాగేశ్వరరావు అన్నారు. ప్రపంచంలోని సంపన్న ఉత్తర దేశాలు అభివృద్ధి చెందుతున్న దక్షిణ పేద దేశాలపై ఆర్థిక ఆంక్షల పేరుతో సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సాంకేతిక వివక్షకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. ఇది మూడో ప్రపంచ యుద్ధానికి దారితీసే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ రచించిన 'ఉత్తర, దక్షిణ దేశాల మధ్య ఉన్న అసమానతలు – ఆ దేశాలు ఎదుర్కొనే సవాళ్లు'అనే పుస్తక సమీక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలోని న్యూ సెమినార్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ కొండా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఉత్తర, దక్షిణ దేశాల మధ్య అసమానతలు రూపుమాపేందుకు ప్రపంచ దేశాలకు ఈ పుస్తకం దారిచూపుతుందని అన్నారు. ఓయూ చరిత్రలో ఐక్యరా జ్యసమితి సెక్రెటరీ జనరల్ ముందు మాట రాసిన మొదటి పుస్తకం ఇదేనని కొనియాడారు. ప్రపంచంలోని దక్షిణ దేశాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం ఈ పుస్తకంలో ఉందని చెప్పారు. ఈ పుస్తకంలో ఉత్తరాది పాలకులు దక్షిణ భారతదేశంపై చూపుతున్న వివక్షత గురించి కూడా ఉందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ కొండా నాగేశ్వరరావు, చిత్రంలో ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, తదితరులు

నూతన సీవరేజ్ పైప్‌లైన్ పనుల పరిశీలన

చిక్కడపల్లి, నవంబర్ 12 : నూతన సీవరేజ్ పైప్‌లైన్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్ అన్నారు. అశోక్ నగర్ సమీపంలో ఇటీవల ప్రారంభించిన నూతన సీవరేజ్ పైప్‌లైన్ పనులను మంగళవారం వాటర్ వర్క్స్ డీజీఎం కార్తీక్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ మల్లేశ్‌తో కలిసి ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, నాయకులు రత్నసాయి చంద్, శ్రీకాంత్, ఎం.ఉమేశ్, ఆకుల సురేందర్, సాయికుమార్, జ్ఞానేశ్వర్, రవి యాదవ్, ఆనంద్‌రావు, సంయుక్తా రాణి ,తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను తప్పదోవ పట్టించేందుకే సర్వే

బీఆర్ఎస్ నగర సంయుక్త కార్యదర్శి గుండవేణి రాజేశ్ గౌడ్

అడ్డగుట్ట, నవంబర్ 12 : కులగణన సర్వే పూర్తిగా బోగస్ అని బీఆర్ఎస్ పార్టీ నగర సంయుక్త కార్యదర్శి గుండవేణి రాజేశ్ గౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలు, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం కులగణన సర్వే అనే అంశాన్ని ముందుకు తీసుకువచ్చిందని అన్నారు. అసలు సర్వేపై ఎన్యూమరేటర్లకు ఎలాంటి స్పష్టత లేదని, అందుకే ప్రజలు అడిగే ప్రశ్నలకు వాళ్ల వద్ద ఎలాంటి సమాధానం లేదని పేర్కొన్నారు. తల తోకలేని సర్వేని తెలంగాణ ప్రజానీకం పూర్తిగా వ్యతిరేకిస్తుందని అన్నారు. హామీల అమలుపై దృష్టి పెట్టకుండా ప్రభుత్వం సర్వే పేరుతో కాలయాపన చేస్తుందని అన్నారు. కులాలవారీగా జనాభాను లెక్కించేందుకు 8 పేజీల బుక్‌లెట్‌లో 75 ప్రశ్నలు ఎందుకని ఆయన ప్రశ్నించారు. సర్వేలో అడుగుతున్న ప్రశ్నలను చూసి ప్రజలు అవాక్కవుతున్నారని, అందులో పొందుపరిచిన ప్రశ్నలు ఎన్యూమరేటర్లనే ఇబ్బందులకు గురిచేసే విధంగా ఉన్నాయని అన్నారు. కులగణన సర్వే నిర్వహణ గడువు పై ఎలాంటి స్పష్టత లేదని, ఇంత మంది సి బ్బందితో సర్వే నిర్వహించడం ద్వారా ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతుందని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కేవలం ఒక్క రోజులోనే సమగ్ర కుటుంబ సర్వేని విజయవంతంగా నిర్వహించి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేశారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 12: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కలిగి ఉండి ఆచరించాలని ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్ సూచించారు. ట్రాఫిక్ నియమాలను మనం పాటించడంతో పాటు ఇతరులను సైతం ఆ దిశగా ప్రోత్సహించాలని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తార్నాకలోని శ్రీచైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా సేఫ్ ఇండియా పేరుతో ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసీపీ సంపత్‌కుమార్, నల్లకుంట ట్రాఫిక్ సీఐ రాంబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల కొందరు తమ విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ రోడ్లపై ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ తమ గమ్యస్థానాలను చేరుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, ఆ దిశగా ప్రజలు సహకరించాలని కోరారు. ఎట్టిపరిస్థితుల్లోనూ మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరించారు. ద్విచక్రవాహనం నడిపేవారికి లైసెన్స్, ఆర్‌సీతోపాటు హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్లు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ట్రాఫిక్ పోలీసులు

రోడ్డు పనులకు శంకుస్థాపన

అమీర్‌పేట్, నవంబర్ 12 : సనత్‌నగర్ డివిజన్‌లో రూ.12 లక్షల వ్యయంతో ఎస్ఆర్‌టీ క్వార్టర్స్, శివాజీ విగ్రహం మార్గంలో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ కొలను లక్ష్మిరెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, పారీ సీనియర్ నాయకులు బుచ్చిలింగం, ప్రకాశ్‌రెడ్డి, రాజు, మధు, రాజేశ్ ముదిరాజ్, పురుషోత్తమ్‌లతో పాటు కాలనీకి చెందిన వంశీకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తలసానిని కలిసిన బీకేగూడ మసీదు బస్తీ కార్యవర్గం

అమీర్‌పేట్ డివిజన్‌లోని బీకేగూడ మసీదు బస్తీ నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆయన నివాసంలో మార్యదపూర్వకంగా కలుసుకున్నారు. మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి నేతృత్వంలో బస్తీ అధ్యక్షుడు నసీరుదద్దీన్ ఖాద్రీతో పాటు ఉపాధ్యక్షుడు మహ్మద్ అంజాద్, ప్రధాన కార్యదర్శి నిస్సారుద్దీన్, సలహాదారు సయ్యద్ అతిక్ సహా పలువురు బస్తీ ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా తనను కలిసిన మసీదు బస్తీ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలుపుతూ, బస్తీ అభివృద్ధికి తన వంతు తోడ్పాటునందిస్తానని హామీ ఇచ్చారు. – అమీర్‌పేట్, నవంబర్ 12

ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలి

వృద్ధులకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న హోం నిర్వాహకులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 12: ప్రతి ఒక్కరూ ఇతరుల పట్ల సేవాభావాన్ని అలవర్చుకోవాలని అరుణోదయ ఓల్డేజ్ హోమ్ చైర్మన్ తాళ్ల లావణ్య అన్నారు. పెద్దల పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యతతో నడుచుకునేలా తల్లిదండ్రులు తమ పిల్లలను పెంచాలని సూచించారు. తార్నాకలోని అరుణోదయ ఓల్డేజ్ హోంలోని వృద్ధులకు మంగళవారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .. ప్రతి ఒక్కరూ ఎదుటి వారి పట్ల ప్రేమ, ఆప్యాయతలు కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాతృదేవోభవ సత్సంగ్ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్, ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ లక్ష్మి, ఆల్ ఇండియన్ హ్యూమన్ రైట్స్ కన్వీనర్ పందిల్ల రవికుమార్, హోం సెక్రెటరీ చిన్నాయాదవ్, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 12 : బౌద్ధనగర్ డివిజన్, రోడ్డు నంబర్ 3, చర్చి లైన్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కంది శైలజ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, జీహెచ్ఎంసీ డీఈ రఘు, ఏఈ కౌశిక్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి కేంద్రీయ విద్యాలయంలో ఏక్తా పర్వ్ వేడుకలు

బొల్లారం, నవంబర్ 12 : ప్రధాన మంత్రి కేంద్రీయ విద్యాలయం తిరుమలగిరిలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి రాష్ట్రీయ ఏక్తా పర్వ్ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. వివిధ ప్రాంతాలకు చెందిన కేంద్రీయ విద్యార్థులు అసాధారణ ప్రతిభ, సాంస్కృతిక ప్రదర్శనలచే అలరించారు. అదే విధంగా ఆర్ట్ ఫాక్స్ మేకింగ్ పోటీ, హస్తకళలో విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఇందిర, రమేశ్, అక్తర్ అలీ, తెలుగు యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.శ్రీనివాసాచారీ, ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

సీఐ రఘుబాబు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 12: లాలాగూడ పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కొలమాల రఘుబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వర్తించిన సీఐ కరుణాకర్‌రెడ్డి సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సీఐ రఘుబాబు మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ పరిధిలో నేర నియంత్రణకు కృషి చేస్తానని చెప్పారు. ఎప్పటికప్పుడు నిఘా పెంచుతూ అసాంఘీక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటానన్నారు. శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

ఆట వస్తువుల అందజేత

బన్సీలాల్‌పేట్, నవంబర్ 12 : పద్మారావునగర్‌లోని స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో హమాలీబస్తీ అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు అవసరమైన బ్లాక్, వైట్ బోర్డులను, ఆట వస్తువులను అందజేశారు. ఉపాధ్యక్షురాలు పావని జన్మదినం సందర్భంగా నవంబర్ నెలలో పుట్టినరోజు ఉన్న చిన్నారుల చేత కేక్ కట్ చేయించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవ్ కుమార్, సభ్యులు అఖిల్, హరీశ్ కుమార్, అంగన్‌వాడీ టీచర్ కుల్సుమ్ పాల్గొన్నారు.

బోర్డు ఎన్నికలు నిర్వహించకపోతే

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడితో ఎమ్మెల్యే శ్రీ గణేశ్

జీహెచ్ఎంసీలో విలీనం చేయండి

కంటోన్మెంట్, నవంబర్ 12: కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు నిర్వహించాలని లేనిపక్షంలో కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన.. కంటోన్మెంట్ బోర్డుకు విచ్చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు ప్రసాద్ చౌహాన్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భం గా బోర్డు పరిధిలోని పలు అంశాలపై కీలకంగా చర్చించారు. 2015 తర్వాత కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు జరగకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా మారిందని, ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. కంటోన్మెంట్ యాజమాన్యంలో ఉన్న వాణిజ్యపరంగా ఉపయోగించే భవనాలపై పన్ను వసూలు చేయాలని, దానివల్ల ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని, అలాగే పెండింగ్‌లో ఉన్న రూ. 900 కోట్ల సర్వీస్ చార్జీల బకాయిలకు సంబంధించి ప్రత్యేక బడ్జెట్ కేటాయించేలా చూడాలని కోరారు. కంటోన్మెంట్ ప్రాంతంలో ఏర్పాటు చేయదలచిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కోసం అనువైన భూమిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సౌకర్యార్థం ఈ ప్రాంతా నికి నీటి సరఫరాను ఒక ఎంజీడీ పెంచి 5.9 ఎంజీడీ నుండి 6.9 ఎంజీడీ పెంపుదలకు సహకరించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఓఎస్‌డీ అజిత్‌రెడ్డి, కంటోన్మెంట్ సీఈవో మధుకర్ నాయక్, వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి, వాటర్ వర్క్స్ సూపరింటెండెంట్ రాజ్ కుమార్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. నీటి బిల్లులపై వన్ టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్ విషయంలో సహకరించి బిల్లుల్లో డిస్కౌంట్ ఇవ్వడానికి అంగీకరించి నందుకు కంటోన్మెంట్ సీఈవో మధుకర్ నాయక్‌కు పత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముప్పిడి మధుకర్, సంకి రవీందర్, నరేశ్, సతీష్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు ప్రసాద్ చౌహాన్‌తో సమావేశమైన ఎమ్మెల్యే శ్రీగణేశ్

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్య

బేగంపేట్ , నవంబర్ 12: అనుమానాస్పద స్థితిలో ఓ యువతి ఆత్మహత్య చేసుకున్నది. ఈ సంఘటన బేగంపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. రసూల్‌పుర ఇందిరమ్మనగర్‌కు చెందిన విఠల్ కూరగాయల వ్యాపారి. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు స్రవంతి ఉంది. స్రవంతి(18) కస్తుర్బా కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఈ నెల 11న దంపతులు.. ఇద్దరు కుమారులతో కలిసి వ్యాపారం నిమిత్తం బయటకు వెళ్లారు. ఇంట్లో స్రవంతి ఒక్కతే ఉంది. రాత్రి 11 గంటలకు తిరిగి ఇంటికి రాగా.. గడియ పెట్టి ఉంది. ఎంత పిలిచినా తలుపు తీయకపోవడంతో ఆందోళనతో తలుపులు పగులగొట్టి చూడగా.. స్రవంతి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే కిందకు దించి స్థానిక ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కాగా.. స్రవంత ఫోన్‌ను పరిశీలించగా లాస్ట్ కాల్ తమ ఇంటి పక్కన ఉండే ఓ యువకుడికి వెళ్లినట్టు తండ్రి విఠల్ గుర్తించాడు. ఆ యువకుడు పలుమార్లు స్రవంతిని వేధించేవాడని, అప్పుడప్పుడు డిమాండ్ చేస్తూ డబ్బులు తీసుకునే వాడని యువతి తండ్రి విఠల్ పోలీసుకులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో వ్యక్తి ..

రసూల్‌పుర ఇందిరమ్మనగర్‌కు చెందిన ఆనంద్(38) మంగళవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు రవి గుర్తించి బేగంపేట పోలీసులకు సమాచారం అందించారు. ఆనంద్‌కు భార్య మహేశ్వరి, ముగ్గురు పిల్లలు వినయ్, గౌతమి, తన్విక్ ఉన్నారు. ఆనంద్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలి

మారేడ్‌పల్లి, నవంబర్ 12: ఆర్టీసీ సంస్థ లో పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వి. కోటయ్య, బుచ్చిరెడ్డి, అధ్యక్షుడు బి.ఎల్ నారాయణలు పిలుపునిచ్చారు. మంగళవారం పికెట్ పార్కులో నిర్వహించిన సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించారు. ఆర్టీసీ సంస్థలో 30 సంవత్సరాల పాటు విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ఆర్టీసీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. అదేవిధంగా ఆర్టీసీ తార్నాక ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిల సాధన కోసం కలిసికట్టుగా పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 250 మంది రిటైర్డు ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శ